క్లుప్తంగా

108లో సాధారణ కాన్పు



ధర్మసాగర్(వేలేరు): పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించి పండంటి బాబుకు జన్మనిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మద్దెలగూడెం గ్రామానికి ఉపాధి నిమిత్తం బీహార్ రాష్ట్రం నుంచి వలస కూలీగా వచ్చిన మహిళకు శుక్రవారం పురిటి నొప్పులు రాగా స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వేలేరు 108 సిబ్బంది అంబులెన్స్‌లో సాధారణ పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ దినేష్, ఈఆర్‌సీపీ డాక్టర్ నవనీత్ సలహాల మేరకు సిబ్బంది మహిళకు సాధారణ కాన్పు చేయగా బాబు జన్మించాడు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారికి ప్రథమ చికిత్స అందించేందుకు హనుమకొండ పట్టణంలోని జీఎంహెచ్ ఆస్పత్రికి తరలించినట్లు పైలట్ దయాకర్ తెలిపారు. కాగా 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వినతిపత్రం అందజేత



శాయంపేట : ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయవద్దని దళిత సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ సుభాషిణికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రెవెన్యూ అధికారులు ఆదాయం సర్టిఫికెట్ జారీ చేస్తున్నారని అన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేయకుండా సర్టిఫికెట్ జారీ చేయడం సరికాదన్నారు. ఆదాయం సర్టిఫికెట్లను అక్రమంగా జారీ చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మంద సురేష్, మారెపల్లి క్రాంతికుమార్, మగ్గం సుమన్, నాగుల పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



ఎల్కతుర్తి: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తుందని సర్పంచ్ సామెల జమునసురేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెంచికలపేటలో శుక్రవారం ప్రభుత్వం అందించిన స్పోర్ట్స్‌కిట్లను క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో క్రీడలు ఆడేందుకు ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. యువత క్రీడల పట్ల ఆశక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలతో శరీరక ధారుడ్యంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడీఓ కృష్ణమూర్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు. అలాగే వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో సభకు హాజరు కావాలని సూచించారు.

మోటార్ వాహన చట్టాన్ని సవరించాలి

హన్మకొండ అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మోటార్ వాహన చట్టం -2019ను సవరించాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ - సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ ఏఓ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాపంగా కోట్లాది మంది కార్మికులు రవాణా రంగంపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. వెంటనే చట్టాన్ని సవరించాలని కోరారు. ఈ క్రమంలో రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము పెనాల్టీలు, చార్జీలకే సరిపోతోందని వాపోయారు. దాంతో డ్రైవర్లకు కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బొల్లారం సంపత్, నాయకులు గడ్డమీద దేవేందర్, యాకయ్య, సుధాకర్, రవి, సారంగసాణి, పోచయ్య, రాజేందర్, రాజు, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల కళ్లు మండుతున్నాయ్

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవం

దామెర: 'సీఎం కేసీఆర్ సారథ్యంలో, నా హయాంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష నాయకుల కళ్లు మండుతున్నాయి. అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ నేనెంటో ప్రజలకు తెలుసు' అని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండల మహిళా సమాఖ్య భవనాన్ని, ల్యాదెళ్లలో గ్రామ మహిళా సమాఖ్య భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. నూతనంగా దామెర మండలం ఏర్పడినప్పటికీ అభివృద్ధి విషయంతో వెనుకడుగు వేయకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా విద్యుత్, తాగు, సాగు నీటి సమస్యలను ఎదుర్కొన్నామని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందన్నారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి ఎమ్మెల్యేగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గత సంవత్సరం మార్చి లో వర్షాల కారణంగా పంట నష్టం జరిగిన బాధిత రైతులకు రూ. 1.36 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీఓ కాసర్ల రవీందర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, దళితబంధు మండల కోఆర్డినేటర్ గరిగె కృష్ణమూర్తి, ఏపీఎం ఝాన్సీ, సర్పంచ్‌లు గురిజాల శ్రీరాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు చిన్నరాజు, ప్రధానకార్యదర్శి ప్రసాద్, శంకర్, నాయకులు రాజు (కేసీఆర్), మల్లయ్య, కుమార్, రాకేష్, రెవెన్యూ సిబ్బంది, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు, సీసీ నగేష్, వీఓఏ హైమ, బాబువియాయా, ఉపసర్పంచ్‌లు కీర్తి, విద్యాసాగర్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, శరత్, రవి, మల్లయ్య, సతీష్, సునీల్‌రెడ్డి, రాజేష్ ప్రభుత్వ కార్యాలయాలకు రెండెకరాల భూమిని దానం చేసిన కాసర్ల వంశీయులు తదితరులు పాల్గొన్నారు.



దామెరలో తహసీల్దార్ కార్యాలయ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

కార్యకర్తలను కాపాడుకుంటా

ఆత్మకూరు: తనపై నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కార్యకర్తలను కాపాడుకుంటానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల పట్టణానికి చెందిన హమాలీ సంఘం నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హమాలీ సంఘం అధ్యక్షుడు బొచ్చు ఆదాం, కార్యదర్శి ఒంటేరు రాజమొగిళి, ఉపాధ్యక్షుడు ఒంటేరు అశోక్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, వైస్ చైర్మన్ విజయ్‌పాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూరు : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

సభ ఏర్పాట్ల పరిశీలన

పరకాల: ఈ నెల 9న తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పట్టణంలోని పశువుల సంతలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. శుక్రవారం పశువుల సంత మైదానాన్ని ఆయన పరిశీలించారు. వేదిక ఏర్పాటు, ప్రజలు కూర్చోడానికి గ్యాలరీ ఏర్పాట్లను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో పరిశీలించి పలు సూచనలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ విజయ్‌పాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హైమావతి, కౌన్సిలర్లు ఉన్నారు.

ఎమ్మెల్యే అరూరిని ఇంటికి సాగనంపాలి

ఐనవోలు: తొమ్మిదేళ్ల అధికారంలో ఉండి మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను రానున్న ఎన్నికల్లో ఓడించి ఇంటికి సాగనంపాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ ప్రజలను కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రమేష్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి మాత్రమే ఆరు నెలలకొకసారి మండలానికి వస్తారని విమర్శించారు. మండలంలో నెలకొన్న సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అపర కుబేరుడు ఎమ్మెల్యే రమేష్ మాకొద్దంటూ ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నేతలే బహిరంగంగా ప్రకటనలు చేశారన్నారు. 2016 సంవత్సరంలో ఐనవోలు మండలం ఏర్పడగా ఇప్పటి వరకూ తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్, వ్యవసాయశాఖ, ఇతర కార్యాలయాలు నిర్మించలేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమీపిస్తుండగా కార్యాలయాల నిర్మాణానికి శిలాఫలకాలు ఆవిష్కరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేట చిరంజీవి, కొత్తూరు సునీల్, వెంకటనారాయణ, రావుల రవికుమార్, ఎండీ రహీంపాషా, ఇల్లందుల ఎలిషా, యాకర సాంబయ్య, కొత్తూరు ప్రతాప్, రహీంఖాన్, రమేష్, అశోక్, రమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు వస్తేనే అభివృద్ధి గుర్తుకొస్తుందా?



మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు మహేందర్

ఎన్నికల సమయం సమీపిస్తేనే స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు అభివృద్ధి గుర్తుకొస్తుందా అని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో గ్రామాలను తొంగిచూడని ఎమ్మెల్యే.. ప్రస్తుతం పర్యటనలు చేస్తూ శిలాఫలకాలు ఆవిష్కరించడం విడ్డూరంగా ఉందన్నారు. భక్తుల విరాళాలతో శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్న వివిధ పనులకు ఎమ్మెల్యే అరూరి రమేష్ శిలాఫలకాలు ఆవిష్కరించకుండా దాతలచే నిర్మించే పనులను ఆయా దాతల చేతనే ఆవిష్కరింపజేస్తే గౌరవప్రదంగా ఉండేదని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆలయ అభివృద్ధిని తన ఖాతాలో వేసుకోవాలనే దురుద్దేశంతో ఎమ్మెల్యే హడావుడిగా శిలాఫలకాలు ఆవిష్కరించి మల్లన్న భక్తుల దృష్టిలో అభాసుపాలయ్యారని దుయ్యబట్టారు.

బీఆర్ఎస్‌కు ఓటమి భయం పట్టుకుంది

- కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టులు

ఎల్కతుర్తి: బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తారని భయపడి కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం వరంగల్ పర్యటనకు వస్తున్న సందర్భంగా ఏలాంటి ఆటంకాలు జరుగకుండా స్థానిక పోలీసులు కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. సాయంత్రం స్వంతపూచికపై విడుదల చేశారు. ముందస్తుగా అరెస్టులు చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని ఆరోపించారు. అక్రమ అరెస్టులతో ప్రజల పక్షాన పోరాటం చేసే గొంతును నొక్కలేరని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. అరెస్టయిన వారిలో పాక రమేష్, కుమార్, రాజు, తదితరులు ఉన్నారు.



ఎల్కతుర్తి : కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

కమలాపూర్‌లో..

కమలాపూర్: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ హనుమకొండ జిల్లా పర్యటన నేపథ్యంలో స్థానిక పోలీసులు మండలంలోని ప్రతిపక్ష పార్టీల నాయకులను శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశారు. పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి, ఎస్ఎస్‌యూవి హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని హనుమాన్ ప్రసాద్, జెట్టి సారంగపాణి, కంకటి హరీష్, కొండపాక మణీష్, అల్లాటి ధర్మారావు, పుల్ల శోభన్, యాంసాని రాజు, నాసని రాజు, పోడేటి భిక్షపతిని ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు. అనంతరం అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమ అరెస్ట్‌లు హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: వరంగల్ నగరంలో శుక్రవారం మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పర్యటనలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా అరెస్టు చేసినట్లు పోలీస్‌లు తెలిపారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమటాపురం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, బూర రాజేందర్, అలువాల రవి, రాజు, బాలకృష్ణ ఉన్నారు.



కమలాపూర్‌లో అరెస్టయిన నాయకులు



ఆత్మకూరు : అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్(వేలేరు): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ పర్యటన సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ నాయకులను స్థానిక పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్దాం హుస్సేన్, నాయకులు జుర్రు సంపత్, పిన్నింటి తిరుపతిరెడ్డి లక్ష్మణ్‌నాయక్, బత్తుల రాజయ్య, ఎరోళ్ల మల్లయ్య, పాషా, మల్లయ్య, కొమురయ్య ఉన్నారు.



ధర్మసాగర్ : అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి: గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్య సేవలందిస్తున్న ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఆశ వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం మహేందర్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదబీమా రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చౌకబారు విమర్శలు మానుకోవాలి

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న చౌకబారు విమర్శలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని వసంతాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ కార్డు స్కీంలను ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండగా మళ్లీ మాయమాటలతో ప్రజల్లోకి వస్తుందన్నారు. బీఆర్ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే గ్యారంటీ స్కీంలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వలీహైదర్, మారపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, చింతల రవిపాల్, కట్టయ్య, భాస్కర్, రాజు, దామోదర్, జగన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎల్కతుర్తి: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ జగత్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు స్వీప్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతి, యువకులతో పాటు గృహిణిలు ఏలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకొని సరైన నాయకులను ఎన్నుకోవాలన్నారు. దేశాన్ని ప్రగతి మార్గం వైపు నడిపించేందుకు కృషి చేయాలన్నారు. కాగా ఓటురు నమోదు శాతాన్ని పెంచేందుకు ఈనెల 4న హైదరాబాద్‌లో ప్రారంభించిన సైకిల్‌యాత్ర ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చేరుకోగా, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కడారి రాజు, తహసీల్దార్ వెంకటభాస్కర్, ఎంపీడీఓలు తూర్పాటి సునీత, భాస్కర్, ఏఈ లక్ష్మణ్‌నాయక్, రాజేష్, ఉల్లాస్, లావణ్య, మోను, జయప్రసాద్, రత్న తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తికి చేరిన సైకిల్‌యాత్ర

ఉపాధ్యాయుల బెదిరింపులు సరికాదు

పరకాల: వేతనాల పెంపు కోసం సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు బెదిరింపులకు గురి చేయడం మానుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టిన భోజన కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం అందించే రూ.3 వేల వేతనంతో కార్మికులు ఏలా జీవిస్తారని ప్రశ్నించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ఉపాధ్యాయులు బెదిరింపులకు గురిచేస్తే సహించేదిలేదన్నారు. కాటన్ దుస్తులతో యూనిఫామ్, ఉచితంగా వంటగ్యాస్, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు బొజ్జ హేమంత్, మండల నాయకులు మడికొండ ప్రశాంత్, బొజ్జ హేమంత్, ప్రేమ్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పోతిరెడ్డి సమ్మక్క పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

గీత కార్మికుల సంక్షేమానికి కృషి

కాజీపేట రూరల్: సామాజిక, ఆర్థిక సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో కల్లు గీత కార్మికులు అభివృద్ధి సాధించేందుకు కల్లుగీత కార్మిక సంఘం నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవి గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం హనుమకొండ జిల్లా గీత కార్మిక సంఘం అధ్యక్షుడు గొని సాంబయ్య అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంవీ.రమణ మాట్లాడుతూ ఈనెల 19న అన్ని గ్రామాల్లో సంఘం జెండాల ఆవిష్కరణ, 20న హైదరాబాద్ సుందరయ్య కళా నిలయంలో రాష్ట్ర ఉత్సవాలు, 21 నుంచి 31 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు. గీత కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రమణను పలువురు సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బూడిద గోపి, తాళ్లపల్లి రామస్వామి, బుర్ర సుధాకర్, వల్లాల గంగాధర్, జిల్లా నాయకులు బుర్ర శ్రీనివాస్, జనగాని భిక్షపతి, మారగోని రాజు, కోతి సాంబరాజు, యాదగిరి, రవీందర్, సాయికుమార్, రమేష్, రమేష్, శేఖర్, బుర్ర సురేందర్, జనగాం లక్ష్మీనారాయణ, శతారి, చింతరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి ఈగ మల్లేశం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

ఖిలా వరంగల్: సీనియర్ రాజకీయ నేత ఈగ మల్లేశం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ ప్రాంగణంలో ఆయనకు మంత్రి కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈగ మల్లేశం రాకతో పార్టీకి మరింత బలం పెరిగిందని, ఆయన సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని చెప్పారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీలు మాలోతు కవిత, వద్దిరాజు రవిచంద్ర, మేయర్ సుధారాణి, శాసన మండలి చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నరేందర్, కుడా చైర్మన్ సుందర్‌రాజు, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి



ముదిరాజ్ ఆత్మగౌరవ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మెపా నాయకులు

ఆత్మకూరు: హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించతలపెట్టిన ముదిరాజ్ ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని మెపా(ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) మండల అధ్యక్ష, కార్యదర్శులు తక్కళ్లపల్లి తిరుపతి, బయ్య పైడి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు సముచితస్థానం కల్పించాలన్నారు. హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నామని, సభకు ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి ముదిరాజ్‌ల ఐక్యతను ప్రపంచానికి తెలుపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ప్రధానకార్యదర్శి కుక్కల రఘు, మత్స్యశాఖ డైరెక్టర్లు గుండెబోయిన శ్యామ్, బయ్య నరేష్, నాయకులు బయ్య భిక్షపతి, మహేందర్, సాంబయ్య, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ల సత్తయ్యకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం పరిశోధకుడు సాగర్ల సత్తయ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. దోరవేటి సమగ్ర సాహిత్యం - ఒక అధ్యయనం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సాగర్ల సత్తయ్యకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

'కడియం'ను కలిసిన రెడ్డి సంఘం సభ్యులు



ధర్మసాగర్: పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన రెడ్డి సంఘం సభ్యులు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని శుక్రవారం కలిశారు. కడియంకు పూలబొకే అందించి త్వరలో జరుగనున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సమ్మిరెడ్డి, కోశాధికారి నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, రవీందర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి ఉన్నారు.